మైన దెబ్బకొట్టింది. 'అబ్బా' అని కోటయ్య వెనుదిరిగి చూడగా శర్మ కోటయ్య చేతిలో బాకు లాక్కొని అతన్ని పొడవబోతుండగా, కోటయ్య చంద్రిక జుట్టుపట్టుకొని ఆమెను గుద్ది కర్ర లాక్కొన్నాడు. శర్మ పొడిచిన బాకు పోటు కోటయ్య చేతికి తగిలింది. కోటయ్య కర్రతో శర్మను కొట్టడానికి అక్కడ తగినంత చోటు లేక కర్ర తిరగలేదు.

ఇంతలో అక్కడ దేవదూతలవలె ఇద్దరు పోలీసులు ప్రత్యక్షమయారు తుపాకులతో. అందరూ ఏకమై కోటయ్యను బంధించారు. సంతత రక్త ప్రవాహంతో శర్మ నీరసుడై క్రింద పడిపోయాడు. పోలీసులు కోటయ్యను పట్టుకోవాలని చాలా దూరంనుంచి వెన్నాడుతున్నారు. అతను దారిలో త్రాగి వెళ్ళినట్లు ఆచూకీ తెలిసి, ఎక్కడికి వెళ్ళినదీ తెలియక అతనిగూర్చి విచారిస్తూ వస్తున్నారు. వాళ్లు కోటయ్య వెంటనే వచ్చివున్నట్లయితే శర్మకు గాయం తగిలేది కాదు.

శర్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతూండగా పార్వతి అతన్ని చూడడానికి వచ్చింది. శర్మ ఆమెనుచూచి సిగ్గుతో తలవంచుకొని, మౌనంగా రెండు కన్నీటి బిందువులు విడిచాడు.

"మీ ముఖమంతా పాడయింది. ఏ ఆడదీ మిమ్మల్ని ఇక వాంఛించదుగదా వాడు మిమ్మల్ని అనాకారిని చేసి ధన్యుడైనాడు! చిలుకకు చెప్పినట్లు ఎంతచెప్పినా నామాట విన్నారా?" అన్నది పార్వతి.

తన కీర్తి, ప్రతిష్ఠలు, తన సౌందర్యం, తన విజ్ఞానం ఒక అజ్ఞానుడి మూలకంగా మంట కలిసి పోయినాయి! "పెక్కు భంగులు వివేక భ్రష్టసంపాతముల్", అని భర్తృహరి చెప్పినట్లుగా తాను వేశ్యాలోలుడగుటే తన దోషం.

కోటయ్యకు ఐదు మాసాల ఖైదు విధించింది ప్రభుత్వం. శర్మ ఆరోగ్యవంతుడై చంద్రికను తీసుకొని మద్రాసు వెళ్ళిపోయాడు. ముఖాన నుదురున రెండంగుళాల మచ్చ అతని తుచ్ఛ కామాంధతకు గుర్తుగా మూర్తీభవించింది. పార్వతి అతని ముఖం చూచి అసహ్య పడింది. చంద్రిక తన భవిష్యత్తును నిర్మించబోతున్న అతనికి తన సర్వస్వం అర్పించడానికి స్థిర నిశ్చయం చేసుకుంది.

కథానిక

# బ్రహ్మచారుల బాహ్యచింతన

మేడిచర్ల గోపాలకృష్ణమూర్తి

ఉదయం ఏడుగంటలయింది. రవి తన సహాధ్యాయి గోపితో కలిసి మహాభాష్యంలో పస్పశాహ్నికంలోని వ్యాకరణాధ్యయన ప్రయోజనాల్ని చింతన చేస్తున్నాడు. ఎవరో ఒకాయన వచ్చారు. ఆయన కాసేపు అటూ ఇటూ చూసి ఇక్కడ రవీంద్ర శర్మగారున్నారా?" అని అడిగారు.

రవి కూర్చున్నవాడల్లా లేచి "ఎందుకండీ?" అని సవినయంగా అన్నాడు.

"ఆయనతో కొంచెం మాట్లాడాలి."

"నేనే! కూర్చోండి."

అందరూ కాసేపు నిశ్శబ్దంగా కూర్చునారు. తరువాత రవి "అయ్యా! తమ దేవూరు" అని అన్నాడు. ఆయన "మాది కృష్ణాపురం, నా పేరు మాధవశర్మ అని అంటారు. మాది హారితస గోత్రం" అని కాసేపాగి "మీరేం చదువుతున్నారు" అని అడిగారు.

"మేమిద్దరం వ్యాకరణ విద్యాప్రవీణ చదువుతున్నాం."

ఆయన ముఖంలో చిరునవ్వు విరిసింది! "అట్లాగా! ఎంత చక్కటి మాటన్నారు. ఈ రోజుల్లో ఈ చదువు చదివేవాళ్ళే లేరు. ప్రతి వాళ్ళూ ఇంగ్లీషు చదివే వాళ్ళే కాని" అని అన్నారు.

గోపి కొంత ముఖం మాడ్చుకొని "అదృష్టవంతుడెవ్వడూ ఈ చదువు చదవడు. చూడండి

మేము నిద్రాహారాలు మానేసి అహర్నిశలూ కష్టపడి చదువుతున్నాం. కాని చివరికి మా ముఖం చూసేవాళ్ళెవరైనా ఉంటారంటారా!" అని కొంచెం విసుగ్గా అన్నాడు.

"అలాగని నిరాశ చెందితే ఏం లాభమో చెప్పండి. నిజంగా సంస్కృతం చదవడమే ఓ అదృష్టం. బ్రహ్మజ్ఞానాన్నివ్వని చదువులు చదువులా?" అని శర్మగారన్నారు.

"బా బూ! అవి గడిచిన కాలంనాటి మాటలు. ఈ రోజుల్లో చదువును చదువుకోసంగా చదివే వాళ్ళెవరో చెప్పండి? ఎవరూ లేరు. అంతా డబ్బుకోసం చూసేవాళ్ళే. రాజకీయానికి సంబంధించని ఈ చదువును ఎవరు గౌరవిస్తారు. పదిసార్లు స్కూలుఫైనలు తప్పిన వాణ్ణయినా గౌరవిస్తారుగాని" అని అంటూ నిట్టూర్పు విడుస్తూ, "చివరకి మేము జనాభా లెక్కలకైనా పనికిరాం"అని అన్నాడు గోపి.

రవికి గోపిఎప్పుడూ ఇలాగే అర్థంలేకుండా నిరాశ పడుతాడనికోపం. అందుకని"నేనొకటి చెప్తాను చూడండి, మన తల్లిదండ్రులసమర్థులని విడిచిపెట్టి సమర్థతగల ఇతర తలిదండ్రుల్ని ఆశ్రయిస్తామా?" అనిఅన్నాడు.

గోపి కళ్లు ఎర్రబారినయ్, "అందుకనే మన ఖర్మం ఇలా కాలింది, స్వాతంత్ర్యం వచ్చినా కూడా"అని కొంచెం తీవ్రంగా అన్నాడు.

రవి ఆయన వచ్చిన పని ఏమిటో తెలుసుకోకుండా ఈ శుష్కవాదనలో పొద్దంతా పోగొట్టుకోటం దేనికనే ఉద్దేశంతో అతని మాటను అంతగా చెవిని పెట్టకుండా "తమకు నాతో పనేముంది స్వామీ!" అని వినయంగా శర్మగారితో అన్నాడు.

ఆయన కాసేపు ఏమీ మాట్లాడకుండా, "నేనిప్పుడే మీ ఊరునుండి వస్తున్నాను. రాత్రి మీ తాతగారితో మాట్లాడాను. వారు మిమ్మల్ని చూడమని చెప్పారు"అని అన్నాడు.

రవి "సరే! ఇదంతా పెళ్ళిగొడవ కామాలు అని అనుకుని "ఏమిటి?"అని అనకుండా మౌనముద్రిత ముఖంతో ఉన్నాడు.

తరువాత కొంచెంసేపాగి "నా కిద్దరాడపిల్లలు. పెద్ద పిల్లకు పదమూడో యేడాది జరుగుతోంది. ఆ పిల్లకే ఇప్పుడు పెళ్ళికావలిసింది. ఎర్రగానే ఉంటుంది. ఏదో కుదురుబాటు గనక ఉంటే ఈ మాసంలోనే చెయ్యాలని. తరువాతనైతే రజస్వలవుతుందేమో ననే మా భయం. ఈ రోజుల్లో రజస్వలానంతర వివాహాలు చేయడం పరిపాటే అయిందనుకోండి. అయినా ఆకాలంనాటి వాళ్ళమవడం చేత ఇంకా ఆ సంప్రదాయాలను విడలేము చూడండి" అన్నాడు శర్మగారు.

గోపి నవ్వుతూ "ఈ రోజుల్లో అవన్నీ పెట్టుకుంటే ఎలాలేండి"అని రవివంక చూస్తూ, "శాస్త్రమేమో రజస్వలాత్పూర్వమే వివాహం చెయ్యమని చెప్తుంది. మొగవాడేమో చేసుకోడు. ఇహ ఆడది రజస్వల కాకుండా ఎలా వుంటుందో చెప్పండి" అన్నాడు.

"అయ్యా మన ప్రయత్నం మనం చేదాం, తరువాత ఈశ్వరేచ్ఛ ఎలా ఉంటే అలాగే జరుగుతుంది."

రవి చిరునవ్వు నవ్వి తూష్ణీంభావంగా ఊరుకున్నాడు. గోపి "మీ అమ్మాయి ఏమైనా చదువుకున్నారా" అని అన్నాడు. రవి ముఖం కొంచెం చిట్లించుకొని గోపికేసి చూశాడు. అనవసరంగా ఈ ప్రశ్నలన్నీ వేసి ఆయన్ని బాధపెట్టడం దేనికి అని రవి అభిప్రాయం. శర్మగారు, "ఏదో చాకలిపద్దులు రాసి చదివే శక్తిమాత్రంవున్నది" అని అంటూ, "అసలు ఆడదానికి పనిపాటలు చక్కగా చేతనవాలిగాని చదువు లెందుకండీ? చదువుకున్న దగ్గరనించీ మొగుణ్ణి ఎదిరించి స్వేచ్ఛగా క్లబ్బుల వెంటా బజార్ల వెంటా తిరిగే దానికేగా!" అని కొంచెం విసుగ్గా అన్నారు. రవికి ఇట్లా మాట్లాడేవాళ్ళమీద ఒళ్ళుమంట జాస్తి. అందుకని "అయ్యా కాలం గడచిన కొద్దీ జీవిత లక్ష్యాలు మారిపోతున్నాయి. అట్లాంటప్పుడు వెనకటి ఆచారలనే ఆచరిస్తామంటే ఏం లాభం. అయినా ఆడది చదువుకున్నమాత్రాన పెద్దనష్టం ఏముంది. యోగ్యతాయోగ్యతలనేవి మనిషినిపట్టే ఉంటాయి. వాటికీ చదువుకూ ఏమీ సంబంధం లేదు" అని అన్నాడు, శర్మగారు "మనకు అవన్నీ దేనికి. ఒక్క యోగ్యత నేది ఉంటే చాలు" అన్నారు. గోపికి ఆమాట

మీద కోపం బాగానే వచ్చింది కాని తమాయించుకుని "ఏ సంప్రదాయం వాళ్ళకు ఆ సంప్రదాయపు చదువులుండాలి లెండి" అని వ్యంగ్యంగా అన్నాడు. ఆయన ముఖాన్ని ముకుళించుకుని కాసేపు మౌనంగా ఉండి వేళ్ళు లెక్కపెడుతూ పంచాంగాన్ని తీసి తిథివార నక్షత్రాలు చూసి "ఎల్లుండి మీరు వచ్చి పిల్లను చూడ్డానికి బాగుంటుం దనుకుంటాను. ఆ రోజు దశమీ అశ్వనీ నక్షత్రం అన్నీ బాగున్నాయి. తరువాత తక్కినవన్నీ మనం మాట్లాడుకోవచ్చు. ఈ మాట మీ తాతగారు కూడా అన్నారు" అని అన్నారు.

రవి రెండు నిముషాలవరకూ ఏమీ మాట్లాడకుండా "అయ్యా! నేనిప్పుడు పెళ్ళి చేసుకో దలచలేదు" అని నమ్రతగా అన్నాడు.

ఆయన తెల్లబారిన ముఖంతో "ఏం" అన్నారు.

"నాకింకో ఏడాదిదాకా చదువున్నది. అదయింతరువాత చేసుకుందామని నా అభిప్రాయం."

శర్మగారు కొంచెం స్వస్థతను చేకూర్చుకుని, ఓస్. దాందేముంది ఓ యేడాదేగా. మా అమ్మాయి చిన్నపిల్లే. ఇంకా రెండేళ్ళవరకూ మీఇష్టంవచ్చినట్లు చదువుకోవచ్చు" అన్నారు.

"నిజమే ననుకోండి. నాకుమాత్రం అప్పుడే చేసుకోవాలని ఉన్నది."

"పోనీ అందాకా ఆగమంటారా!"

"అట్లా నేనెట్లా చెప్పనండీ. అప్పటికైనా నాకు పెళ్ళిచేసుకోవాలనే బుద్ధి పుట్టకపోతే మీకిచ్చిన మాట వ్యర్థం కాదా! ఆడపిల్ల విషయంలో ఎప్పుడూ అలా చెప్పరాదు."

"అట్లాఅంటే ఎలా నాయనా! మనం కావాలన్నప్పుడు మంచి సంబంధాలు వస్తయ్యా."

"అయ్యా! తమరు నా స్థితిని విచారించే ఉంటారు" అని ఇంకా ఏదో చెప్పబోతుంటే "ఆ ఆ! నేనన్నీ విచారించాను" అని శర్మగారన్నారు.

"ఇలాంటిస్థితిలో పెళ్ళిచేసుకుని జీవించడం ఎలాగా అనేదే నాలోని బాధ!"

"మేమంతా జీవించడంలా! మా కందరికీ ఏమాత్రం ఆస్తులున్నయ్యని పిల్లనిచ్చారు" అని కాస్త సేపు ఆగి, "మీరేదో అదోటి మనస్సులో పెట్టుకుని ఉన్నారుగాని నారోసినవాడు నీరోయడా, రాళ్లల్లో పుట్టినవాటికి ఎవరాహారాన్నిస్తున్నారు, అదృష్టం అనేది ఉంటే వృద్ధిలోకి రాకూడదా!"

"ఔననుకోండి. నా భార్యను నేను ఎవరి మీదా ఆధారపడకుండా నా స్వశక్తితో పోషించగలను అనే ధైర్యం నాకు వచ్చిన నాడు చేసుకుంటా. అందాకా చేసుకోను. ఎవరైనా లోకంలో తాత్కాలిక స్థితిగతులే ఆలోచిస్తారు కాని అదృష్టాన్ని చూడరు."

రవి ఎప్పుడు చూసినా "నేను కట్నం తీసుకోటానికి తగనివాణ్ణి. అసమర్థుణ్ణి. సామర్థ్యం వచ్చేవరకూ పెళ్ళి చేసుకోను. ఒక ఆడదానికి అన్యాయం చేయను" అని అంటూంటాడు. ఈమాటకు యెన్నడూ మార్పులేదు. అతనికి అదృష్టం పుట్టేదెప్పుడు పెళ్ళిచేసుకునేదెప్పుడు? రెండూలేదు. ఇలాంటి వెధవ సిద్ధాంతాల నాశ్రయించిన వాళ్ళకు చివరికి మిగిలేదంటూ ఏమీలేదు. అందుకే గోపికి కోపం. కొంచెం ఎర్రబారిన ముఖంతో మూతి బిగించుకుని కూర్చున్నాడు.

శర్మగారు రవిని అపార్థం చేసుకున్నారు. నేనిచ్చే కట్నం ఏమీలేదని ఈవిధంగా అనడం ప్రారంభించేడేమోనని అనుకున్నారు. నిజంగా ఆయనలా అపోహపడటంలో అర్థం లేకపోలేదు. లోకంలో మనం చూస్తునే ఉన్నాం. మనస్సులో ఓ అభిప్రాయాన్ని పెట్టుకుని పైకి ఇంకోరకంగా మాట్లాడేవాళ్ళను అందుకని "మీకు కట్నాపేక్ష ఏమైనా ఉందా అని" అన్నారు.

"అదేం నాకు లేదండీ! అయినా నాకెలా ఇస్తారు? కట్నం పుచ్చుకునేంత స్థితి నాదగ్గిరేముంది?" అని అన్నాడు రవి.

"దానికేం లెండి. చదువైంతరువాత కట్నం వస్తూందనే ఆశఉండవచ్చునుగా!" అని కొంచెం పరిహాస సూచకంగా అన్నారు శర్మగారు.

రవికి కోపం వచ్చింది. శర్మగారి వంక కన్నార్పకుండా చూస్తూ "నిజంగా ఆలస్యం అంతా అందుకోసమేనండీ" అన్నాడు.

"ఎంత కావాలి?

"ఐదు వేలయితే సరిపోతుంది."

"అబ్బో చాలాచిన్న కోరికే నే, నీ కేమో గజం సెంటు భూమీ కూడా లేదు. నువ్వు చదివే చదువేమో ఇదా! ఇల్లాంటివాడికి కట్నంకూడా ఇచ్చి పిల్ల నెవరిస్తారు నాయనా! అసలు నీబోటివానికి పిల్లనివ్వడమే అదృష్టం." అని కొస్త స్వరం తగ్గించి "నా మాట విను. నువ్వు చిన్నవాడివి. నీకు పరిస్థితులన్నీ తెలియవు. ఈవిధంగా కనక నువ్వంటే నీకు పెళ్ళే కాదు." అని అన్నారు.

రవి ఆవేశపూరితమైన వచనంతో, "నిజంగా మీరు నిజం పలికారు. పేదవాణ్ణి కాబట్టి కట్నంతో కూడా పిల్ల నెవ్వరూ ఇవ్వరు. అంటే వారి ఉద్దేశ్యం పిల్ల సుఖపడదనేగా! అట్లాంటప్పుడు నేను పెళ్ళిచేసుకుని పెళ్లాన్నెలా పోషిస్తానో చెప్పండి. అసలు మాబోటి వాళ్ళకి గోచీ దగ్గిర్నుంచీ ఎరువే గా! అందుకోసం నే నడిగినంత కట్నం ఇస్తే ఓ వెయ్యి పెళ్ళిఖర్చుల కుపయోగపరుస్తా. తక్కిన నాలుగువేలూ పెట్టి రెండెకరాలుకొంటా. ఏదో విధంగా బ్రతుకుతా! లోకంలో కొస్తోకూస్తో ఉన్నవాళ్లు తమ సంసారాలు సర్వనాశనం అయిపోయినా సరే తమ పిల్లలను తమకంటె ఎక్కువ ఆస్తికలవారి చేతిలో పెట్టడం కోసం చూస్తున్నారంటే శాశ్వతంగా కన్నీరు కార్చడానికనుకున్నారా, కాదు. ఆ చంద్రార్కం ఏ అడ్డూలేకుండా సౌఖ్యాన్ననుభవించేందుకు. పేదవాడికూడా తన కూతురు సుఖపడాలనే ఉంటుంది కాని ఆమెను సుఖపెట్టే శక్తి అతనిలో లేదు.

"అందుకని ఏంచేస్తాడు. ఏదో విధంగా తన మీద నున్న బరువును తొలగించుకునేందుకు నాబోటి ఓ అనాథకు తీసుకుపోయి ఇస్తాడు. పాపం! ఆమె శాశ్వతంగా జారిపోతున్న గోడల మధ్యలో కన్నీళ్ళు కారుస్తూ ఉంటుంది. నిజంగా ఆమెను కట్నానికి ఆశపడకుండా ఐశ్వర్యవంతుడు చేసుకుంటే ఎంత సుఖపడుతుంది. మీకు పాపం! డబ్బులేదు. అందుకే ఎక్కడో మారుమూల బూజుపట్టిన ఇంటిలో దాగిఉన్న నామీద జాలీ, మృతప్రాయంగా ఉన్న నా సారస్వతంమీద ప్రేమ. లేకపోతే డబ్బే ఉంటే! ఎన్నో యోజనాలదాకా ఎత్తయిన శిఖరాలలో కనుపించే ప్రాసాదాల నడుమ పట్టుపరుపుల మధ్య విశ్వంమరిచి శయనించే శ్వేతాంబరుల సింహద్వారాల ముందరుంటేవి మీ ఆశలన్నీ" అన్నాడు.

శర్మగారు ఆవేశపూరితమైన రవిమాటలను విని విసుగుచెందారు. ఉత్త చాదస్తుడని అనుకున్నారు. దాంట్లో కొంత పిచ్చి కూడా ఇమిడి ఉందనే అనుకున్నారు. "నువ్వు ఇట్లా ఇంకెవరితోనూమాట్లాడకు. మాట్లాడుతే పిల్లను కూడా ఇవ్వరు" అని, "సరే నేను వెళ్ళి వస్తా"నని అంటూ లేచి వెళ్లిపోయినారు.

రవి ఆయన స్థితి చూసి చాలా విచారపడ్డాడు. గోపి "నువ్వు ఆవేశంలో చాలా బాగా మాట్లాడావు. ఆయన ఏ స్థితినంతా చూసి పిల్లవాడికింద కట్టాడు. తెలుసా!" అని పరిహాసంగా అన్నాడు.

రవి, "నేనూ అదే బాధపడుతున్నాను. పరవశం ఎప్పుడూ ఇతి కర్తవ్యతా జ్ఞానశూన్యత నే కలుగచేస్తుంది. ఏంచేస్తాం" అని, కాసేపు ఊరుకుని "యథార్థవాది ఎప్పుడూ పిచ్చివాడే అవుతాడనుకో!" అన్నాడు.

"నువ్వు నిజంగా భలేవాడివి. కట్నం ఇచ్చి పిల్లనిస్తానని అంటే, 'నాకెందుకిస్తారు. నేను పేదవాణ్ణి. ఓ బియ్యేకిస్తే మీ పిల్ల సుఖపడుతుంది' అంటావు కట్నం ఇవ్వలేని సంబంధాలు వస్తే 'నాకు పెళ్ళిఖర్చైనా గిట్టందెలా' అంటావు." అన్నాడు గోపి.

"నా ఉద్దేశాన్ని బాగాగుర్తించావు. ఆయనా అంతే. నాకు కట్నంమీద ఆశలేదండీ! అంటే,




ఆ. దాందేం లేండి, అని ప్రారంభించాడు. నాకు ఒళ్లుమండింది. ఇందాకటి ఉపన్యాసమంతా లేనివాడికీ ఉన్నవాడికీ ఉండే తారతమ్యం చెప్పడంకోసం. మొన్న నెవరో రెండెకరాల పొలమిచ్చి, పిల్లనిస్తానన్నాడే ఆయన కూతురు మూగది. అందుకోసం మనదాకా వచ్చాడు. లేకపోతే మనం ఏమూలుండే వాళ్ళమో! లోకందృష్ట్యా సమర్థుణ్ణి కానంతవరకూ పెళ్ళి కాలేదన్న దిగులు నాకుండదు. ఎందుకంటే పరిస్థితులను కొంతవరకైనా అర్థం చేసుకున్నా కాబట్టి" అన్నాడు రవి.

"ఆహా! ఎంత మహానుభావుడివి. లోకంలో పరిస్థితులను బాగా అర్థం చేసుకున్నవాడివి నువ్వొక్కడివే నేమో! అని వ్యంగ్యహేళనగా అంటూ "చూడు. ఇక్కడికి తొమ్మిది గంటలయి తొమ్మిది నిముషాలయింది. బాహ్య చింతన చింతనగానే ఉన్నది. ఏంచేస్తాం. నీబోటి బ్రహ్మచారిగాళ్ళు సహాధ్యాయులుగా ఉంటే ఇంకా చింతనలు కూడా సాగుతయ్"అన్నాడు గోపి వవ్వుతూ.

---

కథానిక

# కాంతలోని అకాంతత్వం

## ఇచ్ఛాపురపు జగన్నాధరావు

వహా రైల్వేస్టేషన్ ఎప్పుడూ కిటకిట లాడుతూనే ఉంటుంది. ఎజన్సీతో వర్తకం చేసి లాభాలు గుంజుకునేవాళ్ళూ, ఏజన్సీ నుంచి న్యాయం కోసం, విలాసంకోసం పెద్ద పట్టణాలకి వెళ్ళేవాళ్ళూ రైలు వచ్చేముందర టికెట్ కోసం కాచుకునుంటారు. దానికి తోడుగా గుమస్తా రైలు రావడానికిముందర కేవలం పావు గంట ఉందనగా టిక్కెట్లు అమ్మడం ప్రారంభిస్తాడు. అతనికి చాలా అనుభవం ఉండడం వల్ల ఎన్నిటిక్కెట్లు అమ్మడానికైనా ఆ కాలం చాలునని అతని ధైర్యం.

రాజమండ్రి వెళ్దామని ఒక శుభదినాన్ని బయలుదేరాను. నేను స్టేషన్ చేరేసరికి రైలు కింకా అరగంట టైముంది గనక రైల్వే ఉత్తరువుల ప్రకారం అంతకు అరగంట ముందే బుకింగ్ ప్రారంభించబడవలసి ఉన్నా, అది మరో పావుగంటకి కాని ప్రారంభం అవదు. అందుచేత కిటికీ దగ్గర టిక్కెట్లకోసం కూడిన మనుష్యులు తమతమ గొప్పతనాలనీ తక్కువలనీ మరిచిపోయి త్రోపులాటల్లో నిమగ్నులై గొడవ చేస్తూండగా కాస్తదూరంగా బెంచీ మీద కూర్చుని అదే చూడసాగాను.

వాళ్ళందరిలోనూ కాస్త శుభ్రంగా బట్టలు వేసుకున్న ఇద్దరు యువకులు సహజంగా నా దృష్టిని ఆకర్షించారు. త్రోపులాటలో కలియకుండా టిక్కెట్టు తీసుకోవడం ఎలాగా అని కాబోలు ఆలోచిస్తూ ఇద్దరూ కొంచెందూరంగా నిలబడ్డారు మూలకి.

అన్ని తరగతుల ప్రయాణీకులకీ అక్కడే టిక్కెట్లు దొరికేది. ఈ విధంగా త్రోపులాట లేకుండా రెండో తరగతి టిక్కెట్టు కూడా అక్కడ దొరకదు. అందుచేత ఆ యువకుల్లో ఒకాయనతో మామూలుగా సంభాషణ ప్రారంభించాను.

"ఏ వూరు వెళ్ళాలండీ?"అన్నాను చాలా దగ్గర బంధువులాగ.

"రాజమండ్రి వెళ్ళాలండీ"అన్నాడు.

"దొమ్మీ జాస్తిగా ఉంది"అన్నాను.

చికాకుతో "అదే చికాకండీ. పై తరగతులకి వేరే బుకింగ్ రూము, వెయిటింగ్ రూము లేకపోవడం చాలా న్యూసెన్స్"అన్నాడు.

రెండో యువకుడు ఈ పరిస్థితిలో ఎందుకో ప్లాటుఫారమ్ మీదికి వెళ్ళాడు.

"నేనూ రాజమండ్రే వెళ్తున్నాను. దయ ఉంచి నాకో టిక్కెట్టు తీసి పెడతారా? మీ లగేజీ నేను చూస్తూంటాను" అన్నాను.

అతనంగీకరించాడు. డబ్బు అతని చేతికిచ్చాను.